

భూ రీ సర్వేపై అవగాహన

ప్రజాశక్తి-అరకులోయ :భూమి రీ సర్వేను సద్వినియోగం చేసుకోవాలని అరకులోయ తహసీల్దార్ వేణుగోపాల్ సూచించారు. అరకులోయ మండలం బొండం పంచాయతీ రంపుడువలస గ్రామంలో గురువారం భూమి రీ సర్వే గ్రామ సభ నిర్వహించడం తో పాటు, రెవెన్యూ అధికారులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ వేణుగోపాల్ మాట్లాడుతూ,భూ సర్వేలో సరిహద్దులు, సాగుబడిలో ఉన్న భూములు సర్వే నెంబర్ వంటి సమస్యలు, తండ్రి నుండి సంక్రమించిన భూములు కొడుకులకు పంపకాలు, సర్వే నెంబర్ లు ఏవైనా ఇబ్బందులు రీ సర్వే ద్వారా సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో బొండం పంచాయతీ సర్పంచ్ దూరియా భాస్కరరావు, పంచాయతీ పీసా కమిటీ సభ్యుడు పాల్గొన్నారు.


సభలో మాట్లాతున్న తహసీల్దార్.

అధికారులు క్రమం తప్పకుండా

క్షేత్ర స్థాయిలో పర్యటించాలి

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు:జిల్లా స్థాయి అధికారులు క్రమం తప్పకుండా జిల్లాలో క్షేత్ర స్థాయి పర్యటనలు జరిపి సంబంధిత సిబ్బందితో సమీక్షా సమావేశాలు నిర్వహించాల్సించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. నూతన జిల్లాగా అవతరించిన అల్లూరి జిల్లా భారీ గిరిజన ప్రాంతంలో విస్తరించి ఉందని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం చివరి లబ్ధిదారు వరకు సంక్షేమ పథకాలను మంజూరు చేసి అమలు చేస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. ముఖ్యంగా హౌసింగ్, పెన్షన్లు, రేషన్ పంపిణీ, గడపగడపకు మన ప్రభుత్వం పనులు, ఇతర సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులందరికీ అందేలా నిశితంగా పర్యవేక్షించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ సూచించారు. రంపచోడవరం, చింతూరులలో విధులకు సక్రమంగా హాజరుకాని ఉద్యోగులపై ప్రజలు, ప్రజాప్రతినిధుల నుంచి తరచూ ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో అధికారులు తనిఖీలు చేయాలని, సమీక్షలు నిర్వహించాలని, ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అధికారులు కనీసం రెండు రోజులు రంపచోడవరం, ఒక రోజు చింతూరు డివిజన్లలో పర్యటించాలని, పర్యటనలో సంబంధిత కార్యాలయాలను తనిఖీ చేసి శాఖాపరమైన సమీక్షా సమావేశాలను నిర్వహించాలని, సిబ్బంది హాజరును ధృవీకరించాలని సూచించారు. ఆయా ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులను కలవాలని ఆదేశించారు. పర్యటన పూర్తి అయిన తర్వాత పూర్తి నివేదికను జిల్లా కలెక్టర్‌కు తప్పని సరిగా సమర్పించాలని ఆదేశించారు.



పారిశుధ్యం బాధ్యత పంచాయతీ కార్యదర్శులదే..

పాడేరు: పంచాయతీ కార్యదర్శులు జిల్లాలో పారిశుధ్య నిర్వహణ బాధ్యత వహించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. జిల్లాలో క్షేత్ర స్థాయి పర్యటనలలో జిల్లా వ్యాప్తంగా పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేనట్లు గుర్తించడం జరిగిందన్నారు. గ్రామాల్లో రోడ్లకిరువైపులా ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాల పరిసరాలలో పారిశుధ్యం మెరుగుకు సంబంధిత ఎంపిడిఓలు, విస్తరణాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ అధికారులు, గ్రామ వాలంటీర్లు భాగస్వామ్యం కావాలన్నారు. ప్రతి మండలానికి రెండు ట్రాక్టర్లు అద్దెకు తీసుకుని ఆయా మండల పరిధిలో అన్ని గ్రామాల్లో, రోడ్లకు ఇరువైపులా పేరుకుపోయిన చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. ట్రాక్టర్ల అద్దెను పంచాయతీ నుంచి లేదా కలెక్టరేట్ నుంచి పొందవచ్చున్నారు. అందుకు బాధ్యత సంబంధిత ఎంపిడిఓ, పంచాయతీ విస్తరణాధికారి చేపట్టాలన్నారు. ప్రతి పంచాయతీ పరిధిలో పారిశుధ్య నిర్వహణ బాధ్యత సంబంధిత కార్యదర్శిదేనని కలెక్టర్ స్పష్టం చేశారు. గ్రామాల్లో రోడ్లకిరువైపులా మలమూత్ర విసర్జన పూర్తిగా నిషేధించాలని, ప్లాస్టిక్ వాడకాన్ని పర్యాటక కేంద్రాలతో సహా జిల్లా వ్యాప్తంగా పూర్తిగా నిషేధించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ విషయాల్లో ప్రజలకు, వ్యాపారులకు అవగాహన కల్పించాలని సూచించారు. పారిశుధ్య నిర్వహణకు సరిపడా పారిశుధ్య కార్మికులు లేకుంటే సమయానుకూలంగా అందుబాటులో ఉన్న పక్క పంచాయతీ నుంచి కార్మికులను తెప్పించుకుని వారి సేవలను వినియోగించుకోవాలని సూచించారు. జిల్లా, డివిజన్ స్థాయి పంచాయతీ అధికారులు తమ క్షేత్రస్థాయి పర్యటనలలో జిల్లా కలెక్టర్ ఆదేశాల అమలును పరిశీలించి నివేదికలు సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. జారీ చేసిన సూచనలు తప్పనిసరిగా పాటించాలని, లేని పక్షంలో శాఖాపరమైన చర్యలు తప్పవని ఆదేశించారు. ప్రతి 15 రోజులకు ఒకసారి పారిశుధ్య నిర్వహణపై సమీక్ష నిర్వహిస్తామని ఈ సందర్భంగా కలెక్టర్ ప్రకటనలో పేర్కొన్నారు.

340 కేజీల రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి పాడేరు:-ప్రజా పంపిణీ వ్యవస్థకు చెందిన 340 కేజీల రేషన్ బియ్యంతో పాటు వీటిని తరలిస్తున్న ఒక ఆటోను సీజ్ చేసినట్లు జిల్లా పౌర సరఫరాల అధికారి ఆర్.శివ ప్రసాద్ తెలిపారు. గురువారం జిల్లా పౌర సరఫరాల అధికారి, ఉప తహసిల్దార్ బి.ప్రశాంత్ కుమార్‌తో కలసి పాడేరు మండలం గుత్తులపుట్టు సంతలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ తనిఖీలో భాగంగా ఆటోలో అక్రమంగా తరలిస్తున్న 340 కేజీల పిడిఎస్ బియ్యాన్ని గుర్తించి ఆటోతో పాటు సీజ్ చేసామని వెల్లడించారు. వీటి విలువ రూ.1,08,500లుగా నిర్ధారించామని తెలిపారు. వీరిపై 6ఎ నోటీసులు జారీ చేసి సంయుక్త కలెక్టర్ కోర్టులో హాజరు పరుస్తామని శివప్రసాద్ వివరించారు. పిడిఎస్ బియ్యం కొనుగోలు, అమ్మకాలు చట్ట రీత్యా నేరమని, అటువంటి వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పిఎమ్‌జికెఎవై (ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన) పథకం కింద అర్హులైన లబ్ధిదారులందరూఉచిత బియ్యాన్ని ఈ నెల 28వ తేదీలోపు పొందాలని డిఎస్ఓ తెలిపారు. అర్హుల జాబితాను అన్ని సచివాలయాలతో పాటు రేషన్ డిపోలలో ప్రకటించడం జరిగిందన్నారు. లబ్ధిదారులు జాబితాను పరిశీలించి ఉచిత బియ్యం పొందవచ్చని వివరించారు.


స్వాధీనం చేసుకున్న శివప్రసాద్

పాఠశాల భవనం నిర్మించాలి

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు:మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ పరిధి మాయిస్టు ప్రభావిత ప్రాంతమైన దొరగుడా గ్రామంలో పాఠశాల భవన నిర్మాణం తక్షణమే పూర్తి చేసి, వినియోగం లోకి తీసుకురావాలని సర్పంచ్ కొర్ర త్రినాథ్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన దొరగూడ గ్రామంలో సందర్శించి, తాత్కాలికంగా వేసిన రేకుల షెడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, 2020 సంవత్సరంలో ఎస్-ఎస్ఏ నిధులు రూ.45 లక్షలు మంజూరు చేయగా, పాఠశాల భవన నిర్మాణానికి పునాదుల గోతులు తీసి, బేస్మెంట్ పనులు నిలిపివేశారన్నారు. పాఠశాలలో పివిటీజీ విద్యార్థులు సుమారు 15 మంది విద్యార్థులు విద్యానభ్యసిస్తున్నారని, పాఠశాల భవనం పూర్తిగా నిర్మాణం ఆగి పోవడంతో లక్ష్మీపురం పంచాయతీ స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు తన సొంత నిధులు వెచ్చించి పాఠశాల నిర్వహించేందుకు చిన్న రేకుల షెడ్డును నిర్మించారన్నారు. ప్రస్తుతం తాత్కాలిక రేకు షెడ్డులోనే విద్యా బోధన నిర్వహిస్తున్నారన్నారు.సర్వ శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో మంజూరైన రూ.45 లక్షల నిధులు ఏమయ్యాయో విద్యాశాఖ, ఐటీడీఏ అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.


పాఠశాలను పరిశీలిస్తున్న సర్పంచ్ త్రినాథ్


చర్చలు జరుపుతున్న సిఐటియు నాయకులు, కార్మికులు

పంచాయతీ కార్మికుల సమ్మె విజయవంతం

ప్రజాశక్తి-చింతూరు

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చింతూరు పంచాయతీ పారిశుధ్య కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో ఈనెల 22న చేపట్టిన సమ్మె విజయవంతమైంది. మేజర్ గ్రామపంచాయతీ కార్మికులకు 6 నెలల నుండి 11 నెలల వరకు పెండింగ్లో ఉన్న వేతనాలు చెల్లించాలని అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా వారు పట్టించుకోలేదు. దీంతో సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు సమ్మె చేశారు. మూడు రోజుల పాటు కొనసాగిన ఈ సమ్మె ప్రభావంతో పంచాయతీ కార్యదర్శి, సర్పంచు చర్చలకు దిగివచ్చారు. పంచాయతీ కార్మికుల వేతనాలు, పెండింగ్ బిల్లులు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. దీంతో పారిశుద్ధ కార్మికులు సమ్మెను విరమించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ మాట్లాడుతూ ఉదయం లేచిన పారిశుధ్య కార్మికులు పనిచేస్తూ ప్రజారోగ్యాన్ని కాపాడుతున్నారని, అలాంటి వారికి నెలల తరబడి వేతనాలు చెల్లించకుండా నిర్లక్ష్యం వహించడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సీసం సురేష్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, పోడియం లక్ష్మణ్, పంచాయతీ పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

10 కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి -కొయ్యూరు

ద్విచక్ర వాహనంపై అక్రమంగా తరలిస్తున్న 10కేజీల గంజాయిని పోలీసులు గురువారం పట్టుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.... కొయ్యూరు సిఐ ఆధ్వర్యాన సిబ్బంది మండలంలోని కాకరపాడు గ్రామ శివారులో గురువారం వాహన తనిఖీలు చేస్తున్నారు. కెడి.పేట వైపు నుంచి ఏలేశ్వరం వైపు స్కూటీపై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులు పోలీసులను చూసి వెనక్కి తిప్పి పారిపోవడానికి ప్రయత్నించారు. దీంతో పోలీసులు వారిని పట్టుకొని తనిఖీ చేయగా వారి వద్దనున్న లగేజీ బ్యాగులో 10 కేజీల గంజాయి దొరికింది. వారి నుంచి గంజాయితో పాటు ఒక బైకు, 3 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు నర్సీపట్నం మండలానికి చెందిన నక్కా శ్రీను, ముంబయికి చెందిన జోకిమ్ డిసౌజ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సిఐ తెలిపారు.


పట్టుబడిన గంజాయి, నిందితులు

జిల్లా వ్యాప్తంగా రెడ్ క్రాస్ సేవలు విస్తరణ

ప్రజాశక్తి-పాడేరు టౌన్: సేవా భావంతో ఇండియన్ రెడ్ క్రాస్ సేవలను జిల్లా వ్యాప్తంగా విస్తరించాలని రెడ్ క్రాస్ చైర్మన్, ఐటిడిఎ పిఓ రోణంకి గోపాలక్రిష్ణ ఆదేశించారు. గురువారం ఐటిడిఎ సమావేశ మందిరంలో ఇండియన్ రెడ్ క్రాస్ అల్లూరి జిల్లా విభాగం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వచ్చేనెలలో రాష్ట్ర గవర్నర్ జిల్లాలో పర్యటించే అవకాశం ఉందని అన్నారు. పాడేరు డివిజన్ పరిధిలో జరిగే మెగా వైద్యశిబిరంలో పాల్గొనే అవకాశం ఉందని, దానికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. డిసెంబరు 1వ తేదీ నుండి 10వ తేదీ వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి పది వేల మందిని రెడ్ క్రాస్ జీవిత సభ్యులుగా చేర్చాలన్నారు. రంప చోడవరం, చింతూరు డివిజన్లకు రెడ్ క్రాస్ సేవలను విస్తరించాలని చెప్పారు. సంస్థ సేవలు గిరిజనులకు పూర్తి స్థాయిలో అందించి ఆరోగ్య వెలుగులు నింపాలన్నారు. రక్తం కొరత లేకుండా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు షెడ్యూలు ప్రకారం రక్త దాన శిబిరాలు నిర్వహించాలన్నారు. ప్రతీ నెలా రెడ్ క్రాస్ కమిటీ సమావేశం నిర్వహించి సంస్థ నిర్వహణలో జరిగిన ఖర్చులకు ఫైనాన్స్ కమిటీ ఆమోదం పొందాలన్నారు. సంస్థకు వచ్చిన నిధులకు సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించాలని స్పష్టం చేసారు. ఐటిడిఎ నుండి రెడ్ క్రాస్‌కు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అవసరమైన స్టేషనరీని అందిస్తామన్నారు. సేకరించిన రక్తం నిల్వలు, పంపిణీ చేసిన రక్తం వివరాలను సక్రమంగా రికార్డులలో నమోదు చేయాలన్నారు. సబ్ కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. ముందుగా రెడ్ క్రాస్ ట్రెజరర్ టి.అప్పారావు సంస్థ ఆదాయ, వ్యయాలను సభకు వివరించారు. అనంతరం రెడ్ క్రాస్ సంస్థ జీవితకాల సభ్యులు ఐటిడిఎ పిఓ రోణంకి గోపాలక్రిష్ణను చైర్మన్‌గా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ ఎస్.గంగరాజు, సెక్రటరీ ఈశ్వరరావు, లైఫ్ మెంబర్లు లీలాప్రసాద్, లోహితాస్, పి.సూర్యారావు జి.సుబ్రమణ్యం, గౌరీశంకర్, జయమ్మ, కన్యాకుమారి, స్వాతి సమన్వయ కర్త కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పిఓ గోపాలకృష్ణ

యుటిఎఫ్‌పై విమర్శలు తగవు

ప్రజాశక్తి -హుకుంపేట:జెఎసి ఉద్యమాన్ని పాలకులకు తాకట్టు పెట్టిన జెఎసి ఉమ్మడి జిల్లాల కన్వీనర్ రామారావుదొరకు యూటీఎఫ్‌ను విమర్శించే నైతిక హక్కు లేదని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి.మహేశ్వరావు ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నో నిర్బంధాలు, విమర్శలు వచ్చినా గిరిజన ఉపాధ్యాయుల సమస్యలపై ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు.జీవో 3 రిజర్వేషన్ సాధన ఉద్యమాన్ని విచ్ఛిన్నం చేయడానికి పాలకులు చేస్తున్న కుట్రలో జెఏసి రామరావుదొర ఒక ఏజెంట్‌లా ఉన్నారన్నారు.ఆదివాసీ ఉపాధ్యాయులు యూటీఎఫ్ నుంచి బయటకు రావాలని రామరావు దొర చేసిన ప్రకటనపై ఉపాధ్యాయులు తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.గిరిజన ఉపాధ్యాయుల ఉద్యమాన్ని ఉధృతం చేస్తున్న యూటీఎఫ్‌ను విమర్శించే నైతిక హక్కు కూడా రామారావుదొరకు తెలిపారు. రాష్ట్ర విద్యా సదస్సు విజయవంతం కావడంతో పాలక వర్గం లో ఉలికి పాటు మొదలైందని, అధికార పార్టీ నేతల ఆదేశాలతో యూటీఎఫ్‌పై ఆరోపణలు చేయడం తగదన్నారు. జీవో 3 రద్దుకు యూటీఎఫ్ కారణమంటూ బురద జల్లే ప్రయత్నం చేయడం సరికాదని ఖండించారు. గిరిజన ఉపాధ్యాయు, ఉద్యోగుల ఉద్యమాన్ని ఐక్యం చేస్తున్న యూటీఎఫ్‌కు మద్దతు ఇవకుండా పాలకులకు తొత్తులుగా ఉండే వ్యక్తులతో రామారావుదొర కలిసి ఉపాధ్యాయుల ఉద్యమాన్ని బలహీన పర్చడానికి సిద్ధం కావడం, పోరాటాల పట్ల ద్వంద వైఖరికి నిదర్శనం అన్నారు జీవో 3పై రివ్యు పిటీషన్ ఎందుకు దాఖలు చేయలేదో రామారావు దొర గిరిజన సమాజానికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయనకు చిత్తశుద్ధి ఉంటే జీవో 03 రిజర్వేషన్ సాధన ఉద్యమానికి కలిసి రావాలని పిలుపు నిచ్చారు.

చురుగ్గా రోడ్డు పనులు

ప్రజాశక్తి-అనంతగిరి:మండలంలోని టోకురు పంచాయతీ పరిధి చిట్టంపాడు జలపాతానికి పర్యాటకుల సందర్శనకు సౌకర్యార్థంగా రోడ్డు పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. వాహనాల నిలుపు స్థలం కూడా ఏర్పాటు చేశామని టోకురు సిపిఎం సర్పంచ్ కిల్లో. మొస్య అన్నారు. గురువారం రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పంచాయతీ సాధరణ నిధులతో ఈ రోడ్డు పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. రాయివలస నుండి చిట్టంపాడు వరకు రోడ్డు మార్గం ఉందని, చిట్టంపాడు నుండి జలపాతం వరకు ఒక అర కిలోమీటర్ రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ప్రస్తుతం రోడ్డు పనులు చేపట్టడం జరుగుతుదని పేర్కొన్నారు. ఎంపీడీవో, జడ్పిటిసి గంగరాజు చొరవతో ఈ రోడ్డు అభివృద్ధి చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ బి.చంద్రన్న, గ్రామస్తులు మజ్జి అప్పన్న పాల్గొన్నారు.

కనకరాజుకు ఘన సన్మానం

ప్రజాశక్తి-హుకుంపేట:అవినీతిపై నిఘా వేసి కథనాలు రాసిన చాన్విక జ్యోతి విలేకరి నల్లం కనకరాజును మండలం ఏపీటీఆర్ఏ బృందం అభినందించి సన్మానిం చారు. ఈ సందర్భంగా ఏపీటీఆర్ఏ మండల అధ్యక్షులు కె.ఆనంద్ మాట్లాడుతూ, భవిష్యత్తు లో మరిన్ని అవినీతి కథనాలు రాసి సామాన్య ప్రజలకు మేలు చేసే విధంగా ముందుకు సాగాలని ఆయన అన్నారు. గత పది రోజులుగా పంచాయతీ కార్యదర్శి పై నిఘా పెట్టి ఘటైన కథనాల ద్వారా సమాజానికి తెలియజేసినందుకు పలువురు కనకరాజును అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏపీటిఆర్ఎ ట్రెజరర్ లక్కే ఉదయ్ కుమార్, ఉపాధ్యక్షులు మీసాల నాగరాజు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


సన్మానిస్తున్న ఏపీటీఆర్ఎ సభ్యులు

రా రమ్మంటున్న జలపాతాలు


- దారి పొడుగునా అబ్బురపరిచే సుందర దృశ్యాలు
- సరైన రహదారి సౌకర్యం లేక పర్యాటకుల ఇబ్బందులు

ప్రజాశక్తి-సీలేరు

ఆంధ్ర -ఒడిశా సరిహద్దుల్లో ఉన్న జడిగూడ, తరాబు జలపాతాలు ప్రకృతి ప్రేమికులు, పర్యాటకులను ఎంతగానో ఆకర్షిస్తున్నాయి. ఎఒబిలోని మల్కన్‌గిరి జిల్లా, ఇటు పెదబయలు సరిహద్దుల్లో ఉన్న ఇవి చాలా అరుదైన జాలువారా జలపాతాలు. గలగల పారే సెలయేర్ల శబ్దాలు, కిలకిలలాడే పక్షుల రాగాలు ఈ ప్రాంతాన్ని సందర్శించే వారికి ఎంతో అనుభూతిని కలిగిస్తున్నాయి. ఈ జల పాతాలకు చేరాలంటే సీలేరు నుంచి 40 కిలోమీటర్లు, పెదబయలు నుంచి 30 కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉంది. ఈ జలపాతాలకు వెళ్లే దారి పొడుగునా పచ్చటి చెట్లు, మంచు దుప్పట్లు అలముకుని ఉన్న కొండ, కోనలు, లోయలు ప్రకృతి ప్రేమికులను ఎంతగానో అలరిస్తున్నాయి. వీటి సందర్శనకు పర్యాటకులు తరలివెళ్తున్నారు. ఈ సుందర దృశ్యాలను తిలకించి మంత్రముగ్ధులవుతున్నారు. ఆ దృశ్యాలను తమ కెమెరాల్లో బంధిస్తూ సోషల్ మీడియాలో తమ బంధుమిత్రులతో పంచుకుంటున్నారు.

సరైన రహదారి లేక ఇబ్బందులు

ఈ జలపాతాలకు వెళ్లేందుకు సరైన రహదారి కూడా లేదు. రహదారి అంతా పెద్ద పెద్ద రాళ్లతో ఉండడంతో ఈ మార్గంలో ప్రయాణం చేయాలంటే నరకం కనిపిస్తోందని పర్యాటకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గంలో పర్యాటకులు విశ్రాంతి తీసుకొనేందుకు ఎటువంటి వసతులు కూడా లేవు. ఇప్పటికైనా అటు ఒడిశా, ఇటు ఆంధ్రా ప్రభుత్వాలు పర్యాటకంగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని, రహదారి, వసతులు కల్పించాలని పర్యాటకులు కోరుతున్నారు.


జడిగూడ జలపాతం

పెండింగ్ వేతనాలు చెల్లించాలని నిరాహార దీక్ష

ప్రజాశక్తి -రంపచోడవరం

రంపచోడవరం పరిధిలోని 7 మండలాల్లో ప్రజలకు మంచి నీరు అందించే సత్యసాయి మంచినీటి పథకంలో పనిచేస్తున్న కార్మికులకు పెండింగ్‌లో వున్న పది నెలల వేతనాలు తక్షణమే చెల్లించాలని కోరుతూ స్థానిక ఐటిడిఎ ఎదుట గురువారం నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షలను ప్రారంభించిన సీఐటీయూ జిల్లా అధ్యక్షులు మట్ల వాణిశ్రీ, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోత రామారావు మాట్లాడుతూ ఐటీడీఏ, ఆర్‌డబ్ల్యుస్ అధికారులు ఈ కార్మికుల పట్ల అత్యంత నిర్లక్ష్య ధోరణితో వున్నారని విమర్శించారు. మొత్తంగా 125 గ్రామాలకు మంచి నీరు అందించే కార్మికులకు పది నెలలు గా జీతాలు చెల్లించకుండా వారిని ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టడం దారుణమన్నారు. కాంట్రాక్టర్ అసలు పట్టించుకునే పరిస్థితిలో లేరని, అనేక మార్లు అధికారులు, కాంట్రాక్టర్ చుట్టూ కార్మికులు జీతాలు చెల్లించాలని తిరిగిన స్పందించకపోవడంతో సమ్మె చేయాల్సి వచ్చిందని తెలిపారు. గ్రామాలలో గిరిజనులకు నీరు అందకపోవడానికి కారణం అధికారులు, కాంట్రాక్టర్ మాత్రమేనని స్పష్టం చేశారు. ఇప్పటికైనా స్పంచకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.



పూల దండలు వేసి నిరాహార దీక్షలను ప్రారంభిస్తున్న గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు రామారావు

చింతూరు తహాశీల్దారు ఏడు రోజుల సస్పెన్షన్

ప్రజాశక్తి-చింతూరు

చింతూరు మండల తహాశీల్దారు సాయి కృష్ణను ఏడు రోజుల పాటు సస్పెండ్ చేస్తున్నట్లు చింతూరు డివిజన్ సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ గురువారం ఆదేశాలు జారీ చేశారు. తహాశీల్దారు కార్యాలయంలో డివోగా విధులు నిర్వహిస్తున్న నాగుల్ మీరా అనే ఉద్యోగిని కలెక్టర్ కార్యాలయానికి సరెండర్ చేయాల్సిందిగా ఐటిడిఓ పిఓ చేసిన ఆదేశాలను బేఖాతరు చేసి నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకుగాను సాయి కృష్ణను గురువారం ఏడు రోజులు పాటు సస్పెండ్ చేస్తున్నట్లు ఆదేశాలు జారీ చేశారు. డిప్యూటీ తహాశీల్దారు కెసుబ్బారావుకు తహాశీల్దారుగా అదనపు బాధ్యతలను అప్పజెప్పారు.


పాఠశాలలో పెట్టెలను పరిశీలిస్తున్న ఐటిడిఎ పిఓ సూరజ్ గనోరే

ఆశ్రమ, గురుకుల విద్యా సంస్థల్లో పిఒ తనిఖీలు

ప్రజాశక్తి -రంపచోడవరం

మండలంలోని పెద్ద గెద్దాడ జడ్పీ హైస్కూల్, రంపచోడవరం గిరిజన గురుకుల ఆశ్రమ పాఠశాల, గురుకుల జూనియర్ కళాశాలను ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గనోరే గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా విద్యా సంస్థల్లో విద్యా బోధన తీరుపై ఆరా తీశారు. గురుకుల పాఠశాలలోని కిచన్‌ను పరిశీలించిన ఆయన ఇప్పటివరకు ఎన్ని బస్తాల బియ్యం నిల్వ ఉన్నది, ఇతర నిత్యవసర వస్తువులు ఏమేమి ఉన్నవి అడిగి తెలుసుకున్నారు. స్టోర్ రూమ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ అధికారి మాట్లాడుతూ ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలని శ్రద్ధగా విని మంచి మార్కులు తెచ్చుకొని ఉన్నత ఉద్యోగాలకు పోటీ పడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నరసింహమూర్తి, మండల విద్యాశాఖ అధికారి కెవివి సత్యనారాయణదొర, సర్పంచ్ వి.ప్రసాద్, ఉపాధ్యాయులు కె.సూరిబాబు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులను ఇవ్వాలని ధర్నా

ప్రజాశక్తి-కూనవరం

మండలంలోని మధ్యాహ్నం భోజన పథకం కార్మికులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను మంజూరు చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన ఎంఇఒ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి కొమరం పెంటయ్య మాట్లాడుతూ జులై నెల నుంచి నవంబర్ వరకు కొన్ని పాఠశాలలకు బియ్యం రావట్లేదని తెలిపారు. నాణ్యమైన కోడిగుడ్లు ఇవ్వాలని, సేల్స్ మెన్ వేధింపులు ఆపాలని, కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు మడెం బాబురావు, కే నాగమణి, కే భద్రమ్మ, ఎస్ సీత, అనంతలక్ష్మి, చిన్నక్క తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఈశ్వరి

వైసిపి పాలనకు చరమగీతం

మాజీ మంత్రి శ్రావణ్, మాజీ ఎమ్మెల్యే ఈశ్వరి

ప్రజాశక్తి-పాడేరు టౌన్: రాష్ట్రంలో వైసిపి పాలనకు ప్రజలు చరమగీతం పాడే సమయం దగ్గర పడిందని, ఆ దిశగా గ్రామగ్రామాన కార్యకర్తలు శ్రమించి టిడిపిని పూర్వవైభవాన్ని తీసుకురావాలని మాజీ మంత్రి కిడారి శ్రావణ్, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులోని కమ్యూనిటీహాల్లో గురువారం మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి ఆధ్వర్యాన పాడేరు, అరకు నియోజకవర్గాల ముఖ్య నాయకులు, కార్యకర్తలతో పాడేరు మండల వైస్ ఎంపిపి శివకుమార్ అధ్యక్షతన ఆర్‌టిఎస్ (రియల్ టైం స్ట్రాటజీ) నిర్వహించారు. ఆర్‌టిఎస్ బృందం రంజిత్, నారాయణరావు, శ్రీరామకృష్ణ, సత్తిబాబు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జగన్ ప్రభుత్వం రాష్ట్రాన్ని దోచుకోవడం తప్ప చేసిన అభివృద్ధి శూన్యమని విమర్శించారు. టిడిపి నాయకులు, కార్యకర్తలకు ఇబ్బందులకు గురి చేస్తూ ఎన్ని ప్రలోభాలు పెట్టినా వాటికి లొంగని పటిష్టవంతమైన నాయకత్వం ఉండడం శుభ పరిణామని పేర్కొన్నారు. టిడిపికి మెరుగైన క్రమశిక్షణ గల నాయకత్వం గ్రామాల్లో ఉందన్నారు. క్లస్టర్, యూనిట్, బూత్, సెక్షన్ ఇన్చార్జ్ లు, మండల అధ్యక్షులు, సర్పంచ్ లు, ఎంపిటిసిలు కష్టపడి పనిచేసి పార్టీ గెలుపునకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టి కమిషన్ మాజీ సభ్యులు సివేరి అబ్రహం, పాడేరు నియోజకవర్గ అబ్జర్వర్ నారాయణరావు, అరకు పార్లమెంట్ అబ్జర్వర్ భాస్కరరావు, రాష్ట్ర బిసి సెల్ ఉపాధ్యక్షులు పొలుపర్తి గోవిందరావు, రాష్ట్ర టి సెల్ ఉపాధ్యక్షులు చిట్టిబాబు, రాష్ట్ర ఎస్‌టి సెల్ కార్యదర్శి సింహాచలం, రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వహణ కార్యదర్శి వెంకటసురేష్ కుమార్, ఆయా మండలాధ్యక్షులు, క్లస్టర్, యూనిట్ ఇంచార్జులు, బూత్ కన్వీనర్‌లు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు కిరువైపులా చెత్త

పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహానికి వెళ్ళే దారి చెత్తా చెదారంతో నిండి పోయి డంపింగ్ యార్డును తలపిస్తుంది. ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌కు వెళ్లే రోడ్డుకుకి ఇరువైపులా నిత్యం ప్లాస్టిక్ వస్తువులు, బాటిళ్లు, బీరు సీసాలతో పాటు చెత్తా చెదారం దర్శనమిస్తుంది. ఈ రోడ్డు మార్గంలో వివిపిలు, అంగన్వాడి, వెలుగు కార్యాలయం, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కార్యాలయం అధికారులు, స్థానికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ అతిదిగృహంకు వెళ్లే రహదారిలో అపారిశుధ్యం పేరుకు పోయి ఉండటంతో స్థానికుల మండిపడుతున్నారు. అరకులోయ మండల కేంద్రంలో పారిశుధ్యం పేరుకు పోయి ఉండటంతో పర్యాటకులు సైతం ఇబ్బందులు పడక తప్పడం లేదు. అధికారులు స్పందించి ఆర్‌అండ్ బి గెస్ట్ హౌస్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్తాచెదారాన్ని వెంటనే తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

అనారోగ్యంతో యువకుడు మృతి

ప్రజాశక్తి -పెదబయలు రూరల్ :మండలంలోని పర్రేడ పంచాయతీ కల్లబు గ్రామానికి చెందిన కూర్ధాడి మాధవరావు(30) గత రెండు రోజులుగా జ్వరంతో పాటు వాంతులు, విరోచనాలతో బాధ పడుతూ ఇంటి వద్దనే మృత్యువాత పడ్డాడని భార్య బుధమ్మా తెలిపింది. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కుటుంబంలో పెద్ద దిక్కును కోల్పోయామని కన్నీరు మున్నీరుగా భార్యవ విలపించింది. గ్రామంలో ఆశ వర్కర్‌ను నియామకం చేపట్టక పోవటంతో ఇటువంటి సంఘటనలు చోటు చేసుకున్నాయని స్థానికులు తెలిపారు. అధికార్లు స్పందించి ఆశ వర్కర్ పోస్ట్ ను భర్తీ చేయాలని సర్పంచ్ చెండా రవిశంకర్ డిమాండ్ చేశారు.

పారిశుధ్యం మెరుగు పరచండి : ఐటిడిఎ పిఒ

ప్రజాశక్తి-పాడేరు టౌన్: గ్రామ పంచాయతీలలో పారిశుధ్య పనులు మెరుగు పరచాలని ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణ ఆదేశించారు. గురువారం ఐటిడిఎ కార్యాలయం నుండి 11 మండలాల ఎంపిడిఒలు, ఇఒపిఆర్‌డిలు, పిఆర్, టిడబ్ల్యు, ఆర్‌డబ్ల్యుఎస్, ఆర్ అండ్‌బి, విద్యాశాఖ, ఉపాధి హామీ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్పందన సమస్యలు పరిష్కారానికి అన్ని శాఖల అధికారులు చొరవ చూపాలన్నారు. ఇఒపిఆర్‌డిలు, పంచాయతీ కార్యదర్శులు పారిశుధ్య పనుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పర్యాటక ప్రాంతాలపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రతీ మండలంలో రోజుకి 6వేల మందికి ఉపాధి హామీ పనులు కల్పించాలని లేబర్ మొబలైజేషన్ పై ఎంపిడిఒలు, ఉపాధి హామీ ఎపిఒలు శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న నిర్మాణ పనులకు బిల్లుల చెల్లింపులు ఈనెలాఖరు నాటికి పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేసారన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతా భవన నిర్మాణాలు, మన బడి నాడు నేడు పనులు సకాలంలో నిర్దిష్టమైన సమయానికి పూర్తి చేయాలని చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వంలో 193 పనులు మంజూరు చేసామన్నారు. క్రాప్ మిత్రా జీతాలు చెల్లింపులకు ఎంపిడిఒలు చొరవ చూపి త్వరితగతిన చెల్లించాలన్నారు. ఆధార్ సీడింగ్ ప్రక్రియ వేగవంతం, బ్యాంకు ఖాతాల సమస్యలను పరిష్కరించాలని ఎంపిడిఒలకు సూచించారు. గృహ భవన, రహదారుల నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలన్నారు. గృహ నిర్మాణాల పురోగతి పై ఆరా తీసారు. లబ్దిదారులకు బిల్లులు సకాలంలో చెల్లింపులు చేయాలన్నారు. ఈ సమావేశంలో సమావేశంలో టిడబ్ల్యు డిడి ఐ.కొండలరావు, డిఇఒ డా.పి.రమేష్, టిడబ్ల్యు ఇఇలు డివిఆర్ఎం రాజు, కె.వేణుగోపాల్, పిఆర్ ఇఇ కొండయ్యపడాల్, హౌసింగ్ పిడి బి.హెచ్ శ్రీనివాస్ ఎటిడబ్ల్యుఒ ఎల్.రజని, ఎంఇఒ సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

పాడేరు టౌన్: కాఫీ పళ్ల పల్పింగ్ చేయడానికి కిలోకు రెండు రూపాయలు ధర నిర్ణయించడం జరిగిందని ఐటిడిఎ పిఒ రోణంకి గోపాల క్రిష్ణ గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఎస్‌జిలు, సహకార సంఘాలు, కాఫీ రైతుల కోరిక మేరకు కాఫీ పల్పింగ్ చేయడానికి ధర నిర్ణయించడానికి ఒక కమిటీ వేయడం జరిగిందన్నారు. కమిటీ అధ్యయనం చేసి నిర్ణయించిన మేరకు కిలో కాఫీ పళ్లను పల్పింగ్ చేయడానికి రెండు రూపాయలు ధర నిర్ణయించడం జరిగిందని చెప్పారు. చింతపల్లి ఎఫ్‌పల్పింగ్ యూనిట్ పల్పింగ్ ప్రక్రియ జరుగుతోందన్నారు. జి.మాడుగుల, జికె.వీధి పల్పింగ్ యూనిట్లు త్వరలోనే అందుబాటులోకి వస్తాయన్నారు. పల్పింగ్ చేయదలుచుకున్న ఎస్‌జిలు, సహకార సంస్థలు కాఫీ పళ్ల రవాణా చేయడానికి సొంత రవాణా సదుపాయాలు సమకూర్చుకోవాలన్నారు. లోడింగ్, అన్ లోడింగ్ వారే నిర్వహించుకోవాల్సి ఉంటుందన్నారు. కెజి ఒక్కంటికి రెండు రూపాయలు చొప్పున చింతపల్లి యూనియన్ బ్యాంకులోని ఐటిడిఎ పిఒ బ్యాంకు ఖాతా నెం.329102010655803 కు జమ చేసి పల్పింగ్ చేసుకోవాలన్నారు.



విలేకర్లతో మాట్లాడుతున్న పెదలబుడు సర్పంచ్ దాసుబాబు, ఈవో రాజ్ కుమార్

నిబంధనలు అతిక్రమణపై నోటీసులు

సర్పంచ్, ఈఓ స్పష్టీకరణ

ప్రజాశక్తి-అరకులోయ: అరకులోయలోని ప్రభుత్వ హస్పటల్ రోడ్డులో నిర్మించిన విజయ్ విలాస్ రిసార్ట్స్ పంచాయతీ నిబంధనలను అతిక్రమించి నిర్మించడంతోనే నోటీసులు జారీ చేసినట్లు పెదలబుడు మేజర్ పంచాయతీ సర్పంచ్ పెట్టెలి దాసు బాబు, పంచాయతీ ఈవో రాజ్ కుమార్ స్పష్టం చేశారు. విజయ్ విలాస్ రిసార్ట్స్ కూల్చివేతకు నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ పలు సంఘాలు, గిరిజన ఉద్యోగ, ఉపాధ్యాయ, రాజకీయ పార్టీల నాయకులు, జెఎసి, నాయకులు పంచాయతీ నిర్ణయానికి వ్యతిరేకంగా వివిధ నిరసన కార్యక్రమాలు చేయడంతో స్పందించిన పంచాయతీ నిర్వాహకులు గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, స్థానిక ప్రజలు, వార్డ్ మెంబర్లు, చుట్టుపక్కల నివాసముంటున్న వారి ఫిర్యాదు మేరకు రెండుసార్లు నోటీసులు జారీ చేశామని వారు తెలిపారు. లాడ్జి నిర్వాహకుడు జంపరాల అశ్వద్ధామ అనే గిరిజన ఉద్యోగి ఇంటి నిర్మాణం కోసం కేవలం గ్రౌండ్ ఫ్లోర్‌కి అనుమతి పొంది బహుళ అంతస్తులు(విజయ్ విలాస్ లాడ్జి)నిర్మించడాన్ని వ్యతిరేకిస్తూ చుట్టుపక్కల నివాసం ఉంటున్న గిరిజనులు ఫిర్యాదు చేసారని వారు తెలిపారు.లాడ్జి నిర్మించినప్పుడు పంచాయతీ నిబంధనల చట్ట ప్రకారం జి ప్లస్ టు అనుమతి పొందవలసి ఉండని వారు తెలిపారు. అయినా ఎటువంటి అనుమతి పొందలేదన్నారు. నోటీసులు జారీ చేసిన తర్వాత కూడా ఆతని నుంచి ఎటువంటి స్పందన రాలేదన్నారు.దీనికి తోడు పంచాయతీకి చెల్లించవలసిన 2020 -2021 సంబంధించి పన్ను బకాయి కూడా చెల్లించలేదన్నారు. దీంతో పంచాయతీ నిబంధనల ప్రకారం ఆయనకు నోటీసులు జారీ చేశామని వారు తెలిపారు.లాడ్జి అప్పటికే నిర్మాణం చేపట్టి ఉండడంతో, ఈయన గిరిజనుడు కావడంతో పంచాయతీ అప్రూవల్ తీసుకోవాలని సూచించినా స్పందన లేదాన్నారు. అందుకే నోటీసులు జారీ చేశామన్నారు. ఇవేమీ పట్టించుకోని లాడ్జి నిర్వాహకుడు అశ్వద్ధామ మాత్రం తనకేదో అన్యాయం జరిగిందని పంచాయతీ నిర్వాహకులు తప్పులు చేసినట్లు ప్రజా సంఘాల వద్ద వాపోవడం సమంజసం కాదన్నారు.

గ్రానైట్ క్వారీని నిలిపేయాలి

గిరిజన సంఘం నేత చిన్నయ్యపడాల్

ప్రజాశక్తి-పాడేరు : చింతపల్లి మండలం పెద్దబరడ పంచాయతీ గ్రామాల ప్రజలు తెరపల్లి గ్రానైట్ క్వారీతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం తక్షణమే స్పందించి ఆపకపోతే చలో కలెక్టరేట్ చేపడతామని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బోనంగి చిన్నయ్యపడాల్, పాంగి ధనుంజయ్ హెచ్చరించారు. గురువారం మండలంలోని పెద్దబరడ పంచాయతీ తెరపల్లి గ్రానైట్ క్వారీ బాధిత గ్రామాలను సందర్శించారు. గిరిజనులు ఎదుర్కొంటున్న అనారోగ్య సమస్యల్ని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, గ్రానైట్ క్వారీతో మడిగుంట, తెరపల్లి, రబ్బరుగొంది గ్రామాలలో నివసిస్తున్న గిరిజనులు పలు వ్యాధులతో బాధ పడుతున్నారని తెలిపారు. కంకి పాటివెంకన్న పడాల్‌కు 4 నెలల నుంచి కంటి చూపు పోయిందని, ఓ వ్యక్తి పక్షవాతానికి, సోములమ్మకు చెవులు వినపడ లేదని తెలిపారు. గ్రానైట్ క్వారీలో ఒపెన్ బ్లాస్టింగ్ చేయటంతో సమీప గ్రామాల గిరిజనుల నివాస గృహాలకు పగుళ్ళు వస్తున్నాయన్నారు. తాగునీరు బురదమయం అయ్యిందని, వ్యవసాయ పంటలకు అదే నీరు రావడంతో పంటల దిగుబడి కూడా తగ్గి పోయిందని తెలిపారు. అనేకసార్లు ప్రభుత్వాల దృష్టికి తీసుకు వెళ్లినప్పటికీ పట్టించుకోలేదని తెలిపారు. ఎక్కువ మందికి ఈ



మాట్లాడుతున్న పడాల్

అనారోగ్య సమస్యలు తలెత్తక ముందే ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. అధికారులు వెంటనే క్వారీ పరిసరాలను పరిశీలించి ప్రజలు ఎదుర్కొంటున్న కష్టనష్టాలను గుర్తించి క్వారీని ఆపాలని లేకపోతే ఆ చుట్టుపక్కల గిరిజనులతో చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కవడం శ్రవణ్ కుమార్, కంకిపాటి కళ్యాణి, కంకిపాటి జోగులమ్మ, కంకిపాటి రామారావు, కాకరి రామారావు పాల్గొన్నారు .

నిలిచిన బిఎస్‌ఎన్‌ఎల్ సేవలు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు:మండల కేంద్రంలో బిఎస్‌ఎన్‌ఎల్ సేవలకు అంతరాయం ఏర్పడింది. మూడు రోజులుగా బిఎస్‌ఎన్‌ఎల్ సేవలు స్తంభించడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వందలాది రూపాయలు చెల్లించి బీఎస్‌ఎన్‌ఎల్ ఆఫర్లు వేసుకుంటున్న వినియోగదారులకు సిగ్నల్ సక్రమంగా ఉండక పోవడంతో గగ్గోలు పెడుతున్నారు. ఈ మధ్యకాలంలో బిఎస్‌ఎన్‌ఎల్‌తో పాటు జియో, ఎయిర్టెల్ ప్రైవేట్ నెట్వర్క్ సేవలు అందించేందుకు కేబుల్ వర్కులు చేపడుతున్న క్రమంలో బిఎస్‌ఎన్‌ఎల్ కేబుల్ వైర్లు తెగి నెట్వర్క్ సేవలకు అంతరయం కలుగుతోందని వాపోతున్నారు. ఇప్పటికైనా బిఎస్‌ఎన్‌ఎల్ ఉన్నతాధికారులు స్పందించి బిఎస్‌ఎన్‌ఎల్ సిగ్నల్ వ్యవస్థ సక్రమంగా పని చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

పౌష్టికాహార లోపంతోనే రక్తహీనత

ప్రజాశక్తి-అనంతగిరి:గర్భిణీలు,బాలింతలు, చిన్నారులు పౌష్టికాహారం తీసుకోక పోవంతోనే రక్తహీనత ఏర్పడుతుందని అమెరికన్ ఇండియన్ సంస్థ కంట్రీ డైరెక్టర్ డాక్టర్ సుశిత తెలిపారు. మండలంలోని గురువారం లొంగుపర్తి పీహెచ్ పరిధి మేడపర్తి సబ్ సెంటర్లో సంస్థ బృందంతో సందర్శించారు. అంగన్వాడి ద్వారా సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలన్నారు. నవజాత శిశువులకు తల్లులు ఎటువంటి సేవలు అందించానే దానిపై ఆమె అవగాహన కల్పించారు. గర్భిణీలు ఆసుపత్రి సేవలు తప్పకుండా తీసుకోవలసిన అవసరం ఉందని, అప్పుడే తల్లీ బిడ్డ క్షేమంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ రాష్ట్ర ప్రోగ్రాం మేనేజర్ కృష్ణ, మండల కోఆర్డినేటర్లు అప్పలకొండ పాల్గొన్నారు.

బియ్యం లారీ బోల్తా

ప్రజాశక్తి-అనంతగిరి:బీసుపురం గ్రామం సమీపంలోని మలుపు వద్ద బియ్యం లారీ బోల్తా పడింది. మైదాన ప్రాంతం నుండి ఏజెన్సీ ప్రాంతం అరకులోయకు బియ్యం తరలిస్తున్న లారీ గురువారం మలుపు తిరుగుతున్న క్రమంలో బోల్తా పడింది. కేంద్ర ప్రభుత్వం ఉచితబియ్యం పంపిణీకు సంబంధించిన బియాన్ని లారీలో అరకు గొడౌన్‌కు తరలిస్తున్న క్రమంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. లారీ డ్రైవర్, క్లీనర్ సురక్షితంగా బయటపడ్డారు. ఈ బియ్యాన్ని మరో లారీలో అరకు గొడౌన్‌కు తరలించారు

వణికిస్తున్న చలి

ప్రజాశక్తి -హుకుంపేట:మండలంలో గత వారం రోజులుగా చలి తీవ్రత పెరిగింది. చలి తీవ్రత తట్టుకు నేందుకు మండల వాసులు చలి దుస్తులు ధరిస్తున్నారు. సాయంత్రం మంటలు పెట్టి చలి కాసుకుంటున్నారు. వాహనాల హెడ్ లైట్లు వేసుకుని వాహనాలు నడుపుతున్నారు. గత సంవత్సరం కన్నా ఈ సంవత్సరం చలి తీవ్రత ఎక్కువగా ఉందని మండల వాసులు తెలిపారు.



అగ్గి మంట వేసుకున్న గిరిజనులు

ఢిల్లీ ఆందోళనలో సీలేరు జెన్‌కో కార్మిక నేతలు



ఢిల్లీలో ఆందోళనలో పాల్గొన్న సీలేరు జెన్‌కో కార్మిక నేతలు

ప్రజాశక్తి- సీలేరు

విద్యుత్ చట్ట చవరణ బిల్లును తక్షణమే కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద జరిగిన ఆందోళన కార్యక్రమంలో ఏపీ జెన్‌కో సీలేరు కాంప్లెక్స్ 1104 యూనియన్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వై.సత్తిబాబు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎలక్ట్రిసిటీ అమెండ్మెంట్ బిల్లు-2022లో పార్లమెంట్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, ఈ బిల్లుని తక్షణమే వెనక్కి తీసుకోవాలని ఈ ధర్నా చేపట్టినట్లు చెప్పారు. ఈ ధర్నా కార్యక్రమంలో దేశంలోని 21 రాష్ట్రాల పవర్ సెక్టార్ నాయకులు, సిఐటియు నాయకులు పాల్గొన్నట్లు ఆయన తెలిపారు.

27న 'ఇదేం ఖర్మరా రాష్ట్రానికి'

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలోని జడ్డంగి గ్రామంలో ఈనెల 27న ఉదయం10 గంటలకు ఇదేం ఖర్మరా రాష్ట్రానికి అనే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టిడిపి మండల అధ్యక్షులు గొల్లపూడి పెద్దిరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి టిడిపి రంపచోడవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి వంతల రాజేశ్వరి, అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షులు డి.శివరామచంద్రరాజు, పలు మండలాల నుండి ముఖ్య నాయకులు హాజరవుతున్నట్లు వెల్లడించారు. మండలంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు ఇందులో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

రైతులకు విత్తనాల వితరణ

ప్రజాశక్తి- చింతూరు

వరదల కారణంగా నష్టపోయిన రైతులకు సాపిడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అందేరీహిల్స్ సహకారంతో ఎనిమిది గ్రామాలకు చెందిన 500 మంది ముంపు బాధిత రైతులకు గురువారం జొన్న, మినుములు, పెసలు విత్తనాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సాపిడ్ సంస్థ డైరెక్టర్ మీరా ఖాదర్, సాప్డ్ సంస్థ కోఆర్డినేటర్ ఉర్మాదాస్, అహమద్ అలీ, ఆర్గనైజర్లు నాగరాజు, లక్ష్మి, జానకి సంకీర్తన తదితరులు పాల్గొన్నారు.

మూడో రోజుకు రామవరం నిర్వాసితుల దీక్షలు

ప్రజాశక్తి-చింతూరు

చింతూరు ఐటిడిఏ కార్యాలయం ముందు విఆర్.పురం మండలం రామవరం గ్రామానికి చెందిన పోలవరం నిర్వాసితులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి మూడో రోజుకు చేరాయి. 22 మంది ఈ దీక్షల్లో పాల్గొన్నారు. రామవరం గ్రామంలో 104 కుటుంబాలకు చెందిన నిర్వాసితుల పేర్లు ముంపు పరిహార జాబితాలో లేకపోవడంతో రీ సర్వే చేసి తమను ముంపు జాబితాలో చేర్చాలని కోరుతూ వీరు ఈ రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారు. ప్రభుత్వం నుండి స్పష్టమైన హామీ వచ్చేంత వరకు దీక్షలు కొనసాగుతాయని రామవరం నిర్వాసితులు స్పష్టం చేశారు.

బిజెపి ప్రభుత్వ విధానాలపై పోరాటం

సిపిఎం జిల్లా నాయకులు పూనెం సత్యనారాయణ

ప్రజాశక్తి-విఆర్.పురం

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చినబాబు పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని చిన్నమట్టపల్లిలో సిపిఎం నాయకులు సత్తిబాబు అధ్యక్షతన పార్టీ జనరల్ బాడీ సమావేశం జరిగింది. వివిధ గ్రామాల నుండి హాజరైన కార్యకర్తలు వివిధ అంశాలు, ప్రభుత్వ విధానాలపై చర్చించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ, చిన్నబాబు మాట్లాడుతూ బిజెపి సర్కారు ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటీకరణ చేస్తుందని, బిఎస్‌ఎన్‌ఎల్, స్టీల్ ఫ్యాక్టరీ, ఎల్‌ఐసి, వాడరేవులు విద్యుత్ ఇలా అన్నింటినీ ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేస్తుందని విమర్శించారు. పార్టీ ఉద్యమ ప్రణాళిక అమలుకు శాఖలే కీలకమని చెప్పారు. శాఖలు ఐక్యత ఉద్యమాలకు రూపకల్పన చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కారం లక్ష్మి ఎంపిటీసీ పూనెం ప్రదీప్ కుమార్, సర్పంచులు పూనెం సరోజిని, పులి




మాట్లాడుతున్న సిపిఎం జిల్లా నాయకులు పూనెం సత్యనారాయణ

సంతోష్ కుమార్, సవలం మారయ్య, కారం బుచ్చమ్మ పార్టీ నాయకులు కుంజ నాగిరెడ్డి, కమ్మచిచ్చు సత్యనారాయణ, పడ్లాజి రమేష్, గుండుపూడి లక్ష్మణరావు, సున్నం నాగమ్మ పాల్గొన్నారు.

నిమ్మచెట్టులో ప్రత్యేక వైద్యశిబిరం

కాలినడకన వాగులు దాటుకుంటూ వెళ్లిన వైద్య సిబ్బంది



గిరిజనుల ఆరోగ్యంపై ఆరా తీస్తున్న డాక్టర్ హిమబిందు

ప్రజాశక్తి- సీలేరు

జికె వీధి మండలం, దారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో నిమ్మచెట్టు గ్రామంలో గురువారం ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. దారకొండ నుంచి కొంతవరకు వాహనంలో వెళ్లిన వైద్య సిబ్బంది అక్కడి నుంచి కాలినడకన వాగులు వంకలు దాటుకుంటూ వెళ్లారు. వైద్య అధికారి హిమబిందుతో పాటు సిబ్బంది గ్రామంలో గిరిజనులకు వైద్య వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రతి ఇంటికి వెళ్లి రోగులకు వైద్య సేవలు అందించారు. బాలింతరాలు సీతమ్మ తీవ్ర అస్వస్థతతో బాధపడుతూ ఆసుపత్రికి రాకుండా గ్రామంలోనే ఉండిపోయినట్టు వైద్య అధికారి గుర్తించి ఆమెకు మెరుగైన వైద్య సేవలు అందించారు. అనంతరం జరిగిన అవగాహన కార్యక్రమంలో డాక్టర్ హిమబిందు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు అనారోగ్యానికి గురైతే దారకొండ పిహెచ్‌సికి రావాలని సూచించారు. ఆసుపత్రిలోనే కాన్పు పొందాలని, శిశువుల ఆరోగ్యం కోసం ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. శిశువులకు పసరు మందులు పట్టరాదని, ప్రభుత్వ ఉచితంగా సరఫరా చేస్తున్న మందులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎస్ పోతురాజు, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



వాగు దాటి వెళుతున్న డాక్టర్ హిమబిందు

నిబంధన అతిక్రమిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

వాహనదారులు నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని రాజవొమ్మంగి ఎస్సై టీజీ నరేంద్ర ప్రసాద్ అన్నారు. స్థానిక అల్లూరి జంక్షన్ వద్ద గురువారం సాయంత్రం వాహన తనిఖీలు చేపట్టారు. ఏలేశ్వరం, రాజవొమ్మంగి ప్రధాన రహదారి మీదగా వచ్చి పోయే ప్రతి వాహనాన్ని ఆపి నిశితంగా తనిఖీలు చేశారు. రికార్డులు పరిశీలించి రికార్డులు సక్రమంగా లేని పలువురు వాహనదారుల నుండి అపరాధ రుసుము వసూలు చేశారు. మద్యం సేవించడంతో బాటు త్రిబుల్ రైడ్ వాహనాలు నడుపుతున్న పలువురుపై కేసులు నమోదు చేశారు. మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలకు గురై కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయని వాహనదారులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. వాహన పత్రాలు, ఇన్సూరెన్స్ పత్రాలు కలిగి ఉండాలని, హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఏపీఎస్పీ బెటాలియన్ పాల్గొన్నారు.



బ్రీత్ ఎనలైజర్‌తో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేస్తున్న పోలీసులు

జూనియర్ కాలేజీ స్థల పరిశీలన




కాలేజీ స్థలాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

ప్రజాశక్తి-అడ్డతీగల

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ, జడ్పీ హైస్కూల్ మైదాన ప్రాంతం (ఆట స్థలం) అన్యక్రాంతమవుతుందని సోమవారం జిల్లా కలెక్టర్ దృష్టికి వెళ్లగా, ఆ స్థలాన్ని సర్వే చేయించుటకు రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్ గురువారం కాలేజీ గ్రౌండ్‌ను పరిశీలించారు. స్థలం పూర్తి వివరాలను తహశీల్దారు శ్రీనివాస్, సర్వేయరు గోవిందరాజులు, వీఆర్వో బాలయ్యను అడిగి తెలుసుకున్నారు. సోమవారం లోపల సర్వే చేసి ఆ భూమిని స్కూల్‌కు అప్పగించాలని ఆయన ఆదేశించారు. జేఈ నాగరాజును నాడు నేడు పనులు విషయంపై అడిగి తెలుసుకున్నారు. తహశీల్దారు కార్యాలయాన్ని పరిశీలించి శిథిల వ్యవస్థలో ఉన్న కార్యాలయాన్ని చూసి నూతన కార్యాలయం ఎందుకు ప్రారంభం కాలేదని ప్రశ్నించారు. నూతనంగా నిర్మిస్తున్న తహశీల్దారు కార్యాలయం భవనాన్ని పరిశీలించారు. ఈ కార్యాలయ పూర్తి వివరాలు తెలుసుకొని ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్‌కు లెటర్ పెట్టమని తహశీల్దారుకు సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు సుజన ఆనందకుమారి, ఉస్కూల్ ఓల్డ్ స్టూడెంట్స్ రాంప్రసాద్, సుబ్బారావు, ఎం.శ్రీనివాస్, ఎన్ శ్రీనివాస్, జి సురేష్ బాబు పాల్గొన్నారు.

ఈ-క్రాప్ బుకింగ్ రశీదుల పంపిణీ



రశీదులతో రైతులు

ప్రజాశక్తి -అడ్డతీగల :మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో సర్పంచ్ పప్పుల చిట్టమ్మ అధ్యక్షతన ఈ-క్రాప్ బుకింగ్ రైతులకు ఈ-క్రాప్ ఫిజికల్ ఎక్నోలెడ్జిమెంట్ రసీదులు ఎడిఎ సావిత్రి చేతులు మీదగా డొక్కపాలెం రైతులకు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎడిఎ మాట్లాడుతూ ఈ- క్రాప్ చేసిన రైతుల వరి ధాన్యం కొనుగోలు చేయనున్నట్లు చెప్పారు. సాధారణ రకం 75 కేజీలు రూ.1530, 100కేజీలు రూ.2040కు, ఎ గ్రేడ్ రకం 75 కేజీలు రూ.1545, 100 కేజీలు రూ.2060కు కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి సువర్ణ కుమారి, వైస్ సర్పంచ్ ముప్పన శెట్టి శ్రీను, పంచాయతీ సెక్రటరీ అనురాధ, విఎఎ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-మారేడుమిల్లి

మారేడుమిల్లి మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ సార్ల లలిత కుమారి అధ్యక్షతన నిర్వహిస్తాయినట్లు ఎంపీడీఓ వీర కిషోర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని కోరారు